క్లుప్తంగా

అర్హులు మాత్రమే లబ్ధిదారులు

ఆర్మూర్: ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా ఉన్న అర్హులు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారులుగా ఉంటారని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఆర్థిక స్థితిగతులపై మున్సిపల్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలు సరిగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ క్లస్టర్ ఆఫీసర్లు కిరణ్, కిషన్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆలయ పనుల పరిశీలన

ఎడపల్లి(బోధన్): జానకంపేటలో స్వయంభూ లింగేశ్వర ఆలయ నిర్మాణ పనులను మంగళవారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ పరిశీలించారు. ముందుగా శివలింగానికి పూజ లు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో త్రయంబకేశ్వర్ నుంచి దేవతల విగ్రహమూర్తులను తీ సుకువచ్చి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు చేయూతనందించా లని భక్తులను కోరారు. ఆలయ చైర్మన్ ఉప్పు సురేష్, ఆలయ నిర్మాణ దాత శంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆర్మూర్: పెద్దపల్లి డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న విధులకు ఆటంకం కల్పించి దాడికి పాల్పడిన రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ నాగరాజు, జిల్లా జాయింట్ సెక్రటరీ డాక్టర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆస్పత్రి తనిఖీలో భాగంగా చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న స్కానింగ్ మిషన్‌ను సీజ్ చేసిన ఘటనలో ఈ దాడి జరిగిందని వివరించారు. మహిళ వైద్యురాలిపై దాడిని ఖండించారు.

జడ్జికి పుస్తకాల అందజేత

ఆర్మూర్: ఆర్మూర్ కో ర్టులో సీనియర్ సివి ల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవికి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసి స్వాతంత్య్ర పోరాటం అంశాలతో పాటు దేశ నాయకులపై రూపొందించిన పుస్తకాలను అందజేశారు. ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలోని ఆమె కార్యాలయంలో మంగళవా రం ఆయన కలిశారు. న్యాయ సేవా అవగాహన సదస్సులకు తమవంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా జడ్జి పేర్కొన్నారు.



న్యాయమూర్తి సేవలు అభినందనీయం

ఆర్మూర్: పట్టణంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన వేముల దీప్తి సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరళారాణి అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, చిల్వేరి శ్రీధర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, మద్దుల గంగారాం పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు నిలువుటద్దం



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో 50 ఏళ్ల క్రితం ఆస్పత్రిని ప్రారంభించిన డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి నిస్వార్థ సేవకు నిలువుటద్దమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ కొనియాడారు. ఆర్మూర్ పట్టణంలోని ఆయన ఆస్పత్రిలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆర్మూర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ చార్టర్ మెంబర్‌గా జగదీశ్వర్‌రెడ్డి అందిస్తున్న సేవలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ కోశాధికారి నారాయణ గౌడ్, రఫీ గోహర్, సుధీర్ బాబు, రాక్సి రమేష్, అంబల్ల తిరుపతి, శశిధర్ రెడ్డి, విజయానంద్, శ్రీహరి పాల్గొన్నారు.

పదాధికారుల ప్రతిపాదిత పేర్ల జాబితా అందజేత

బాల్కొండ: బీజేపీ బాల్కొండ మండల పదాధికారుల ప్రతిపాదిత పేర్ల జాబితాను మంగళవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డికి మండల అధ్యక్షుడు అంబటి నవీన్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసే వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

కాంటాలు కావు.. బస్తాలు పోవు

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు
- వేధిస్తోన్న హమాలీల కొరత
- రైస్ మిల్లుల్లో లారీలు ఖాళీ కావడం లేదంటున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను అమ్ముకోవడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు కానీ ధాన్యం కాంటా కావడం లేదు. హమాలీలు దొరికితే గన్నీ సంచులు దొరకడం లేదు.. సంచులు దొరికితే లారీలు దొరకడం లేదు. చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



ముప్కాల్ మండలం రెంజర్లలో పేరుకు పోయిన వరి ధాన్యం నిల్వలు

బాల్కొండ: మద్దతు ధర కల్పించటానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కావడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పల నిల్వలు పేరుకుపోతున్నాయి. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు గడుస్తుంది. కాని త్వరితగతిన కాంటాలు చేపట్టడం లేదు. కారణం హమాలీల కొరత తీవ్రంగా ఉందంటున్నారు. 12 మందికి ఒక హమాలీల బృందం ఉంటుంది. ఒక్కో కేంద్రంలో ఒక్కటే బృందం పని చేస్తోంది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు కాంటాలు చేయడం సాధ్య పడటం లేదు. పక్షం రోజుల కంటే ఎక్కువ రోజులు కేంద్రాల్లో ధాన్యం మగ్గుతోంది. నాలుగు రోజుల నుంచి ఆకాశంలో మబ్బులు, ఉరుములు, మెరుపులు వస్తుండటంతో అన్నదాతలు కంటి మీద కునుకు లేకుండా కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. రాత్రికి వరి ధాన్యం కుప్పలపై కాగితాలు కప్పడం.. ఉదయం తీయడం ఇదే పనిగా రైతులు గడుపుతున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి పంపిస్తున్నా రైస్ మిల్లుల్లో కూడ సకాలంలో లారీలు ఖాళీ కావడం లేదు. రైస్ మిల్లులో ఉండే హమాలీలే కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు నిర్వహించి, వారే లారీలు ఖాళీ చేయటానికి రైస్ మిల్లులకు పోవాల్సిన పరిస్థితి ఉంది.

బోనస్ కారణం..

ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో సన్నరకం ధాన్యాన్ని అంతా కూడ రైతులు కొనుగోలు కేంద్రాలకే తీసుకు వస్తున్నారు. ప్రయివేట్ వ్యాపారులకు విక్రయించడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకు పోతుంది. గతంలో పచ్చి ధాన్యాన్నే దళారులకు మద్దతు ధర కంటే రూ.100 తక్కువకు వి క్రయించుకునే వారు. కాని ప్రస్తుతం బోనస్ కోసం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నా రు. ఉన్నత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కాంటాలు నిర్వహించి, బస్తాలు తరలించేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

వారం రోజులు అవుతుంది

కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువచ్చి వారం రోజులు అవుతుంది. కాని ఇప్పటి వరకు కాంటాలకు లైన్ రాలేదు. మరో 5 రోజులు సమయం పడుతుందంటున్నారు. రోజూ వడ్ల కుప్పల వద్దనే ఉంటున్నాను. తీవ్ర ఇబ్బంది అవుతుంది.

– మల్లన్న, రైతు

రెండు రోజుల్లో సమస్య తీరుతుంది

కొనుగోలు కేంద్రాల్లో ప్రధానంగా హమాలీల కొరత ఉంది. రైస్ మిల్లుల్లో లారీలు ఖాళీ కాకపోవడం వల్లనే ఆలస్యమవుతుంది. రెండు రోజుల్లో సమస్య తీరుతుంది. కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఉండకుండా వెంటనే కాంటాలు నిర్వహించే ఏర్పాట్లను చేస్తున్నాం. – శ్రీనివాస్, డీటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్

కొత్త చట్టంతో సమస్యలు పరిష్కారం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- బోధన్‌లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు
- హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ తదితరులు



బోధన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి(ఆర్‌వోఆర్) కొత్త చట్టంతో భూ వివాదాలు సత్వరంగా పరిష్కారానికి నోచుకుంటాయని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కీలక అంశాలను కొత్త చట్టంలో పొందుపర్చిందని తెలిపారు. మంగళవారం బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో బోధన్, సాలూర మండల రైతులకు మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించగా.. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల క్రమబద్ధీకరణ ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు.

మే, జూన్‌లో రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

సదస్సులో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు పూర్తయిన అనంతరం మే, జూన్ నెలల్లో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి అధికారులు వెళ్లి రైతు సదస్సులు నిర్వహిస్తారని అన్నారు. భూ సమస్యలున్న రైతులు ఈ సదస్సుల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవోలు తమ తమ స్థాయిలో విచారణ చేసి భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లు చేస్తారని అన్నారు. పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా అందిస్తారన్నారు. తహసీల్దార్‌లు ప్రతి ఏడాది డిసెంబర్ 31న గ్రామ రెవెన్యూ రికార్డులను ప్రింట్ తీసి భద్రపరుస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలో పొందపర్చిన అంశాలను తెలియజేశారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్‌లు, సొసైటీ చైర్మన్లు, ఏసీపీ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై నివేదిక ఇవ్వండి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డు నిర్వహణపై పూర్తి నివేదిక అందించాలని, బయో మైనింగ్ వేయింగ్ మిషన్ తూనికల్లో జరుగుతున్న అవకతవకలపై ఆరా తీసి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో తిరిగి డంపింగ్ యార్డులో చెత్త సేకరణ, బయో మైనింగ్ ప్లాంట్‌ను పరిశీలించారు. డంపింగ్ యార్డు, బయో మైనింగ్ ప్లాంట్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ విఠల్, పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినొద్దీన్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావ్, నాయకులు తూము శరత్ రెడ్డి, పులి శ్రీనివాస్, మీర్ నజీర్ అలీ, ఆనంపల్లి ఎల్లం, దాము, రామకృష్ణ, బల్దియా అధికారులు ఉన్నారు.

జ్ఞానాన్ని మించిన సంపద లేదు

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



పచ్చలనడ్కుడలో గ్రంథాలయం వద్ద అన్వేష్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు

వేల్పూర్: జ్ఞానాన్ని మించిన సంపద లేదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. పచ్చలనడ్కుడలో మంగళవారం ఆయన జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, జేడీ ఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ కవితా రెడ్డితో కలిసి కాళోజీ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ ఫోన్ వచ్చిన తర్వాత పుస్తకాలు దూరమయ్యాయన్నారు. పుస్తకాలు ఎంత చదివితే అంత జ్ఞానం వస్తుందన్నారు. యువకులు, గ్రామస్తులు తప్పకుండా లైబ్రరీని ఉపయోగించుకోవాలన్నారు. జేడీ ఫౌండేషన్ చైర్మన్ వీవీ లక్ష్మీనారాయణ సౌజన్యంతో గ్రంథాలయం ప్రారంభించినట్లు చెప్పారు. నేతలు గడ్డం నర్సారెడ్డి, టక్కర్ గంగాధర్, గుడాల మోహన్, జి.నర్సారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృథాగా లిఫ్టు నీరు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన బస్సాపూర్ లిఫ్ట్ నీరు వృథాగా పోతోంది. లిఫ్ట్ ద్వారా నీటి విడుదల ప్రారంభించారు. కాని పైపులైన్‌ల నిర్వహణ మరిచారు. దీంతో సంపు నుంచి నీరు వృథాగా పోతుంది. ప్రాజెక్ట్ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సంప్రదాయ నృత్యాలకు జీవం పోయాలి



జ్ఞాపికలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఆర్మూర్: వెస్టర్న్ మోజులో పడిపోతున్న యువతకు సాంప్రదాయ నృత్యాలపై అవగాహన కల్పిస్తూ వాటికి తిరిగి జీవం పోయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆర్మూర్ అధ్యక్షుడు చెరకు పృథ్వీరాజ్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నటరాజ నృత్యనికేతన్‌ను స్థాపించి ఆంధ్ర నాట్యం, పేరిణి నాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలను చిన్నారులకు నేర్పిస్తున్న మాడవేడి నారాయణ, నాట్య గురువు జైకిషన్‌లతో పాటు నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. క్లబ్ ప్రతినిధులు జీవీ నర్సింహారెడ్డి, తిరుపతి, ఉదయ్ తదితరులున్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



బోధన్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఘటనకు నిరసనగా మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టి దేశంలో అశాంతిని కలిగించడమే ఉగ్రవాదుల లక్ష్యంగా ఉందని అన్నారు. భారతీయులు ఐక్యంగా ఉండి వారిని ఎదుర్కోవాలని సూచించారు. నాయకులు నూర్జహాన్, శంకర్‌గౌడ్, గంగాధర్ అప్ప, నన్నేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

జన్నేపల్లి బంద్



నవీపేట: పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మంగళవారం మండలంలోని జన్నేపల్లిలో బంద్ పాటించారు. వ్యాపారస్తులకు ముందస్తు సమాచారం ఇవ్వడంతో స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజశేఖర్

మాక్లూర్: హెల్మెట్ లేకుండా వాహనంతో బయటకు రావద్దని ఎస్సై రాజశేఖర్ సూచించారు. మండల పరిధిలోని దాస్ నగర్ వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ లేకుండా బయటకు వస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

నవీపేట: మండల కేంద్రంలోని బాసర మూలమలుపు వద్ద ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో వాహనదారులకు హెల్మెట్ ధారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు హెల్మెట్ దోహదం చేస్తుందన్నారు. మైనర్ డ్రైవింగ్ నేరమని, తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు.

రుద్రూర్: మండలంలోని రుద్రూర్- కోటగిరి ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై సాయన్న వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 26 మందికి రూ.5,760 జరిమానా విధించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

రుద్రూర్: రైతుల భూములకు పూర్తి భరోసా కల్పించడానికి ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. పోతంగల్‌లో భూభారతి చట్టంపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ధరణి పోర్టల్ ద్వారా పరిష్కారం కాని సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీని వల్ల భూమికి సంబంధించిన చిన్న చిన్న సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారమవుతాయని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి భూవివాదాలు తలెత్తకుండా ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్ కేటాయిస్తారని అన్నారు. భూమి వివరాలు, హద్దులు స్పష్టంగా సూచించేలా సర్వే పటంను పట్టా పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తారని అన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో చందర్, మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గంధపు పవన్ కుమార్, విండో చైర్మన్ సునీల్ కుమార్ చౌదరి, శాంతీశ్వర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

తూములకు మరమ్మతులు చేయించండి



సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు

ఆర్మూర్: పట్టణ శివారులోని గూండ్ల చెరువుకు ఉన్న మూడు తూముల షట్టర్లు పని చేయడం లేదని, వాటికి మరమ్మతులు చేపించాలని రైతులు కాంగ్రెస్ నేత పొద్దుటూరి వినయ్‌రెడ్డిని కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ఆయన నివాసంలో మున్నూరు కాపు కాశీ హనుమాన్ పంథా, గురడి కాపు పంథా, కాపెల్లి పంథాల రైతులు మంగళవారం ఆయనను కలిసి సమస్యను వివరించారు. అనంతరం సన్మానించారు. వినయ్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో ఫోన్ లో మాటాడారు.

'అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి'



పూలమాల వేస్తున్న బైరి నరేష్

బోధన్: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని మూఢనమ్మకాల నిర్మూలన సంస్థ వ్యవస్థాపకులు బైరి నరేష్ అన్నారు. సాలూర మండలం ఖాజాపూర్‌లో అంబేడ్కర్ సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని అతిథులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ముందుగా బౌద్ధ సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్థ జాతీయ కో–ఆర్డినేటర్ గాండ్ల సుజాత, సమతా సైనిక్ దళ్ జాతీయ ఉపాధ్యక్షుడు రెంజర్ల రాజేష్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పాండు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పశువులకు టీకాలు



మాక్లూర్: అమ్రాద్‌లో మంగళవారం 396 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామాల వారీగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పశుపెంపకందారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే సూచించారు. కార్యక్రమంలో టి వినీత, అహ్మద్‌పాష, శ్యామల, ఆర్ కల్యాణి, మహేశ్వరీ, పుష్ప, గంగాధర్, సికిందర్, బేగ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మోచి సంక్షేమ సంఘం సలహాదారుడిగా రవి



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణానికి చెందిన వోటరుకారి రవిని తెలంగాణ రాష్ట్ర మోచి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గానికి సలహాదారుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని మినీ లెదర్ పార్క్ పరిశ్రమకు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన ఆయనను రాష్ట్ర కమిటీకి సలహాదారుడిగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి ప్రారంభించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని వారు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడే వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ బాన్సువాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడారు. కోటగిరి మండల కార్యదర్శి విఠ ల్ గౌడ్, నల్ల గంగాధర్, తోట సాయి లు, నరేందర్, శివ, గంగాధర్, సాయిలు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్: మేడే ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం పట్టణ కేంద్రంలో వేర్వేరు చోట్ల ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి దాలమల్క పోశెట్టి, టీయూసీఐ జిల్లా ప్రతినిధి మల్లేష్, వివిధ కార్మికులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. హక్కులను కాపాడుకునేందుకు మేడే స్ఫూర్తితో సంఘటితంగా పోరాడుతామని వారు పేర్కొన్నారు.

గోదాంలో ధాన్యం డంపింగ్ అడ్డగింత



నిరసన వ్యక్తం చేస్తున్న కళ్యాపూర్ రైతులు

రెంజల్(బోధన్): సమీప గ్రామ రైతుల ధాన్యం నిల్వ చేయకుండా దూరపు గ్రామాల రైతుల ధాన్యాన్ని గోదాంలో నిల్వ చేస్తుండగా కళ్యాపూర్ గ్రామ రైతులు అడ్డుకున్నారు. వివరాలు.. మండలంలోని దూపల్లి విండో ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపాల్సి ఉండగా నిల్వలకు స్థలం కొరత ఉందని మిల్లర్లు చెప్పడంతో విండో చైర్మన్ భూంరెడ్డి స్థానికంగా ఉన్న గోదాంలలో ధాన్యాన్ని నిల్వ చేస్తున్నారు. సోమవారం రాత్రి దూపల్లి గ్రామం నుంచి లారీలలో ధాన్యాన్ని కూనేపల్లి గ్రామంలోని గోదాంలో నిల్వ చేసేందుకు తీసుకురాగా కళ్యాపూర్ గ్రామ రైతులు అడ్డుకున్నారు. తమ గ్రామంలోని ధాన్యం నిల్వ చేయకుండా ఎక్కడి నుంచో తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలా నిల్వ చేస్తారని ప్రశ్నించారు. మంగళవారం సైతం కూనేపల్లికి చేరుకుని తమ ధాన్యాన్ని నిల్వ చేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రామానికి చెందిన ధాన్యం కూనేపల్లి గోదాంలోనే నిల్వ చేయాలని అప్పటి వరకు గోదాంకు అడ్డంగా నిలిపిన తమ ట్రాక్టర్లను పక్కకు తప్పించేదిలేదని రైతు జల్లయ్య పట్టుబడుతున్నారు. ఈ విషయమై విండో చైర్మన్ భూంరెడ్డిని వివరణ కోరగా.. జల్లయ్య విషయంలో తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు.